సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 7 । జూలై । 2023



డిజిటల్ చదువులు
సర్కారు బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 8లో



నిరీక్షణ ఫలించిన వేళ
జాజులబంధలో పండగ వాతావరణం నెలకొంది. పాఠశాల ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 8లో



ఎడతెరిపి లేకుండా వర్షాలు
ముంచంగిపుట్టులో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

అర్హులందరికీ ధ్రువీకరణ

● జాయింట్ కలెక్టర్ ఏవీఎస్ శర్మ



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న జేసీ ఏవీఎస్ శర్మ, జెడ్పీటీసీ రోషిణి

అరకులోయ టౌన్: జగనన్న సురక్ష పథకం విద్యార్థులకు, రైతులకు మేలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఏవీఎస్ శర్మ అన్నారు. గురువారం అరకులోయతోపాటు సిరగం పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశామన్నారు. ప్రతి మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి, వలంటీర్లు, ఉద్యోగులు సహకారంతో జగనన్న సురక్ష లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేవిధంగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోని జెడ్పీటీసీ రోహిణి, సర్పంచ్ దాస్‌బాబు, ఎంపీడీవో నగేష్, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, రామన్న, వార్డు మెంబర్లు కిరణ్, త్రినాథ్, భగత్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల ట్రెజరీ స్కాం కేసు కొట్టివేత

అడ్డతీగల: తప్పుడు బిల్లులు పెట్టి ప్రభుత్వ నిధులు డ్రా చేశారనే అభియోగం మేరకు అడ్డతీగల పోలీసులు నమోదు చేసిన కేసులో నేరారోపణ రుజువు కాకపోవడంతో దాన్ని కొట్టివేస్తూ స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్ డియో గురువారం తీర్పు చెప్పారు. కంటిన్జెన్సీ నిధుల పేరిట పీహెచ్‌సీలకు నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంటోంది. వీటిని రవాణా వ్యయం, పోస్టల్ ఖర్చులు, ఎలక్ట్రికల్, టెలీఫోన్ బిల్లులు చెల్లించడానికి ట్రెజరీ ద్వారా డ్రా చేసుకోవడానికి వీలు కల్పించింది. ఈ మేరకు అడ్డతీగల ట్రెజరీ పరిధిలోని దుప్పలపాలెం, గంగవరం, పిడతమామిడి, లాగరాయి, రాజవొమ్మంగి, చవిటిదిబ్బలు, జెడ్డంగి, ఎల్లవరం పీహెచ్‌సీల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఒకటికి రెండు సార్లు బిల్లులు పెట్టి రూ.41.21 లక్షలు కంటిన్జెన్సీ నిధులు డ్రా చేశారని వివిధ విభాగాలకు చెందిన 26 మంది (వైద్య శాఖ, ట్రెజరీ) ఉద్యోగులపై 2014 ఫిబ్రవరిలో కేసు నమోదు చేశారు. నలుగురు ఇప్పటికే మృతి చెందగా, మరో నలుగురిని కేసులో సంబంధం లేదని తొలగించారు. మిగతా 18 మందిపై విచారణలో నేరారోపణ రుజువుకాక పోవడంతో కేసుని కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఇకో–వైజాగ్ కాన్సెప్ట్‌పై నేడు చిత్రలేఖన పోటీలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఇకో–వైజాగ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై అవగాహనకు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. నగరంలోని 592 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఇకో–వైజాగ్ కాన్సెప్ట్‌పై శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేంజర్ ఫోర్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇకో క్లీన్, ఇకో గ్రీన్, ఇకో బ్లూ, ఇకో జీరో ప్లాస్టిక్, ఇకో జీరో పొల్యూషన్ అనే ఐదు కాన్సెప్ట్‌ల్లో ఏదైనా ఒకటి విద్యార్థులు తీసుకోవచ్చని తెలిపారు. 3 నుంచి 6వ తరగతి వరకు జూనియర్ విభాగం, 7 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగంగా పోటీలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి పాఠశాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పోటీల అనంతరం ఆ చిత్రలేఖనాలతో ఆర్ట్ ఎగ్జిబిషన్ సైతం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

ఏపీపీఎస్సీ గ్రూప్–4 అర్హుల జాబితా విడుదల

● 15న ధ్రువీకరణపత్రాల పరిశీలన

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి జిల్లాలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. 43 పోస్టులకు సంబంధించి 1:2 నిష్పత్తిలో 84 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా https:// visakhapatnam.ap.gov.inలో అందుబాటులో ఉందని, వీరంతా ఈ నెల 15న జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 23న కలెక్టర్ కార్యాలయంలో జరిగే కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. మెయిన్స్ పరీక్ష హాలు టికెట్, ఆధార్ కార్డు, పాస్‌ఫొటోతో పరీక్షకు హాజరు కావాలన్నారు. అభ్యర్థుల చిరునామాలకు వ్యక్తిగత మెమోలను రిజిస్టర్ పోస్టు, ఈమెయిల్ ద్వారా పంపించామని.. ఎవరికైనా మెమోలు అందకపోతే ఈ నెల 15న జిల్లా పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వన్ జన్.. ధనాధన్

- 100 రోజుల కార్యక్రమానికి విశేష స్పందన
- ఇంతవరకు 11 వేల మందికి ఖాతాలు
- ప్రతి గిరిజన కుటుంబానికి పోస్టల్ ఖాతా
- ఆగస్టు 9 కల్లా శతశాతం లక్ష్యం



కొత్త ఖాతా బుక్ అందిస్తున్న పోస్టల్ సిబ్బంది



ఇంటికి వెళ్లి పోస్టల్ పొదుపు ఖాతాలపై వివరిస్తున్న బీపీఎం

ముంచంగిపుట్టు: గిరిజనులకు తపాలా సేవలను మరింత చేరువ చేసేందుకు పోస్టల్ శాఖ శ్రీకారం చుట్టిన వన్ జన్ ధన్ (గిరిజన ప్రాంత ఆర్థిక చేరిక) కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి గిరిజన కుటుంబానికి పోస్టల్ ఖాతా ఉంటూ, స్కీమ్ లబ్ధి పొందాలనే లక్ష్యంతో సబ్ పోస్టు ఆఫీస్, బ్రాంచ్ పోస్టు ఆఫీస్‌ల సిబ్బంది గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతున్నారు. మే 2న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5వ తేదీ నాటికి అల్లూరి జిల్లాలో 11 వేల మందికి ఖాతాలు తెరిపించారు. వచ్చే నెల 9వ తేదీ కల్లా శతశాతం గిరిజనులను ఖాతాల్లో చేర్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

...వన్ జన్ ధన్ లక్ష్యం..

ప్రతి పంచాయతీల్లోనూ బ్రాంచ్ పోస్టాఫీసు ఉంది. అయినప్పటికీ పోస్టల్ శాఖ అందిస్తున్న అనేక పొదుపు ఖాతాలు, బీమా సౌకర్యాలపై అవగాహన లేక వాటి ప్రయోజనాలను గిరిజనులు పొందలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో వన జన్ ధన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పోస్టల్ శాఖ పీఎంజీ స్థాయి అధికారి నుంచి ఎస్‌పీ, ఐపీవో, బీపీఎంలు, ఏబీపీఎంల వరకు గిరిజన గ్రామాల బాట పట్టారు. కొండలు, గుట్టలు ఎక్కి మరీ గిరిజన గ్రామాలకు చేరుకుని ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు అనుగుణంగా ఏ ఖాతాను తెరిస్తే ఉపయోగంగా ఉంటుందో వివరిస్తున్నారు. దాని వల్ల కలిగే ప్రయోజనాన్ని క్షుణ్ణంగా తెలియజేస్తున్నారు. తక్కువ పొదుపుతో అధిక వడ్డీ వచ్చే ఖాతాలను తెరిపిస్తున్నారు. దీనికి తోడు ప్రతి వారం బ్రాంచ్ ఆఫీసు పరిధిలోని కొన్ని గ్రామాలను కలుపుకుని ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో ఈ నెల 5వ తేదీ నాటికి 11 వేల ఖాతాలు తెరిపించారు.

పోస్టల్ శాఖలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా పొదుపు ఖాతాలు

1. పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతా (పీవోఎస్‌బీ)–ప్రతి ఒక్కరికీ ఉండాల్సిన ఖాతా
2. రికరింగ్ డిపాజిట్ ఖాతా(ఆర్డీ)–చిన్న మొత్తాల పొదుపు ఖాతా
3. సుకన్య సమృద్ధి యోజన ఖాతా(ఎస్ఎస్‌వై)–ప్రతి ఆడపిల్లకు ఉండాల్సిన ఖాతా
4. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్(ఎంఎస్ఎస్‌పీ)–ప్రతి మహిళకు ఉండాల్సిన ఖాతా
5. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతా(పీపీఎఫ్)–ప్రతి ఉద్యోగి ఉండాల్సిన ఖాతా
6. మంత్లీ ఇన్కమ్ స్కీమ్ ఖాతా(ఎంఐఎస్)–నెలవారీ ఆదాయమందించే ఖాతా
7. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ ఖాతా(ఎస్సీఎస్ఎస్)–ప్రతి పెన్షనర్‌కి ఉండాల్సిన ఖాతా
8. టెమ్ డిపాజిట్ ఖాతా(టీడీ)–ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా
9. కిసాన్ వికాస్ పత్రం(కేవైసీ)–పొదుపు చేసే సొమ్ము పదేళ్లలో రెట్టింపవుతుంది
10. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్(ఎన్ఎస్సీ)
11. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ)– రూ.100తో తెరిచే ఖాతా

అల్లూరి జిల్లాలో పోస్ట్ ఆఫీసుల వివరాలు..

సబ్ డివిజన్	సబ్ పోస్టాఫీసులు	బ్రాంచ్ పోస్టాఫీసులు
అరకు	3	74
పాడేరు	4	74
రంపచోడవరం	6	66
చింతూరు	6	55

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం..



వచ్చే నెల 9న ఆదివాసీ దినోత్సవంలోగా ప్రతి గిరిజన కుటుంబానికి తపాలా పొదుపు ఖాతా తెరవాలని లక్ష్యాన్ని పెట్టుకున్నాం. తపాలా శాఖా సేవలపై గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నాం. పోస్టల్ పొదుపు ఖాతాలపై ప్రతి సబ్ పోస్ట్ ఆఫీసుల వద్ద ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. అధికంగా ఖాతాలు తెరుస్తున్నాం. ప్రతి ఒక్కరూ పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. – జనపాల ప్రసాద్‌బాబు, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్

జిల్లాలో 4,456 ధ్రువపత్రాల పంపిణీ

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని పది మండలాల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలను అధికారుల బృందాలు విజయవంతంగా నిర్వహించాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.14,426 గృహాల నుంచి వలంటీర్లు తమ యాప్‌లలో వివిధ ధ్రువపత్రాల కోసం 13,054 వినతులను స్వీకరించారన్నారు. 15,218 టోకెన్లు నమోదు చేసి, 11,431 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారన్నారు. వీటిలో 4,456 ధ్రువపత్రాలను గురువారం సాయంత్రం నాటికి ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. 90 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, మిగిలిన 6,885 ధ్రువపత్రాల పంపిణీకి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు ప్రత్యేక శిబిరాలు

జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలను జిల్లాలోని 13 మండలాల పరిధిలో 19 సచివాలయాల్లో శుక్రవారం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. అడ్డతీగల మండలం కోనలోవ, చింతపల్లి మండలం చౌడుపల్లి, లోతుగెడ్డ, చింతూరు మండలం చట్టి, దేవీపట్నం మండలం ఇందుకూరు, డుంబ్రిగుడ మండలం అరమ, కండ్రూమ్, జి.మాడుగుల మండలం గెమ్మెలి, వంజరి–1, గంగవరం మండలం మర్రిపాలెం, కొయ్యూరు మండలం అడాకుల, మర్రివాడ, మారేడుమిల్లి మండలం చావిడికోట, పెదబయలు మండలం అరడకోట, సీకరి, రంపచోడవరం మండలం బి.వెలంకోట, ఐ.పోలవరం, వి.ఆర్.పురం మండలంలోని రాజుపేట, వై.రామవరం మండలంలోని యర్లగెడ్డ సచివాలయాల్లో శిబిరాలు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినులకు హిమోగ్లోబిన్, సికెల్ సెల్ పరీక్షలు

డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆదేశం



బందవీధిలో సబ్ సెంటర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో జమాల్ బాషాతో వైద్య సిబ్బంది

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలతోపాటు హిమోగ్లోబిన్(హెచ్‌బీ), సికెల్ సెల్ ఎనిమీయా పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్రశేఖర్‌ను ఆదేశించారు. మండలంలోని బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను గురువారం డీఎంహెచ్‌వో సందర్శించారు. బందవీధి సబ్ సెంటర్‌లో పీఎంఎస్ఎంఏ ద్వారా గర్భిణులకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు మొదటి కాన్పులో రూ.6 వేలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తీసుకొని వైద్యుల సూచనలు పాటించాలన్నారు. నెలలు నిండిన గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ఎస్. ప్రకాష్, హెచ్‌వీ మేనక, ఏఎన్ఎం సుమిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఈవోఐపై సాధ్యాసాధ్యాలు పరిశీలించండి

రాష్ట్ర పరిశ్రమల కమిషనర్ ఆదేశం



ఎంపీకి లేఖ అందజేస్తున్న సీ ప్రధాన కార్యదర్శి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన ముడి పదార్థాల సరఫరా, అడ్వాన్స్ పేమెంట్ ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)పై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని జిల్లా పరిశ్రమల అధికారిని రాష్ట్ర పరిశ్రమల కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన అధికారిక ఉత్తర్వులు పంపారు. ఈవోఐ ప్రకటన వెలువడిన తర్వాత ఉక్కు అధికారుల సంఘం(సీ) నాయకులు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఉక్కు కర్మాగారాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి, ఎంపీ ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో ఈ అంశంపై నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారికి లేఖ పంపింది. లేఖ ప్రతి అందుకున్న సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ గురువారం ఎంపీ ఎంవీవీని కలిశారు.

జూనోటిక్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తం

పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాజారవికుమార్



పాడేరు ఏరియా పశువుల ఆస్పత్రిలో రేబిస్ టీకాలు వేస్తున్న ఏడీ డాక్టర్ రాజారవికుమార్

సాక్షి,పాడేరు: పశువులతోపాటు పెంపుడు కుక్కల నుంచి వ్యాప్తి చెందే ప్రమాదకర జూనోటిక్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగానే ఉండాలని పశుసంవర్ధక శాఖ పాడేరు ఏడీ రాజారవికుమార్ కోరారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పాడేరులోని పశువుల ఏరియా ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాల కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీతోపాటు పలు పశువైద్యశాలల వైద్యులు, సచివాలయాల పశువైద్య అసిస్టెంట్లు పాడేరు మండల పరిధిలోని పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఆయా కుక్కల యజమానులకు పలు సూచనలు చేశారు. అనంతరం సమావేశంలో ఏడీ రాజారవికుమార్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల ద్వారా జూనోటిక్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వీటి విషయంలో సరైన పరిశుభ్రత పాటించడంతోపాటు అనారోగ్యాలను నివారించే టీకాలను క్రమం తప్పకుండా పశువుల యజమానులు వేయించాలని సూచించారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే కొన్ని వ్యాధులు ఉన్నాయని, వాటిని నివారించడం ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా రేబిస్ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో 250 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక వైద్యాధికారులు కూడా చరణ్, రాజీవ్‌కిశోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● పచ్చని కొండల్లో ఒంపుల దారి



జోడిగుమ్మ కొండలపై ఒంపుల రహదారి

మన్యంలో ప్రకృతి అందాలకు కొదువ లేదు. అక్కడ కొండ కోనల్లో ఎటు చూసినా చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్తరువులే కనిపిస్తాయి. ఆకాశం ఎరుపెక్కినా... మబ్బుపట్టినా.. అద్భుత దృశ్యమే ఆవిష్కృతమవుతోంది. తాజాగా ముంచంగిపుట్టు మండలంలో అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీ జోడిగుమ్మ గ్రామ సమీపంలో పచ్చని కొండల మాటున నూతనంగా వేస్తున్న రహదారి ఒంపులు తిరుగుతూ ఆకట్టుకుంటోంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర వేస్తున్న ఈ రహదారిలో గురువారం వర్షం పడి వెలసిన తర్వాత కొండల చాటున పచ్చంగా కనిపించిన దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది. – ముంచంగిపుట్టు

జగనన్న సురక్షతో పేదలకు రక్ష



గూడలో గిరిజనులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పేదలకు రక్ష అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని గడికించుమండ, గూడ గ్రామ సచివాలయ కేంద్రంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గడికించుమండ సచివాలయంలో 1,625 ధ్రువపత్రాలు, గూడలో 743 ధ్రువపత్రాలు గిరిజనులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సీడీపీవో బాలచంద్రమణి దేవి, వైస్ ఎంపీపీ ఒంటుబు ప్రియాంక, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఒంటుబు సామ్యేల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, ఎంఎల్‌వో శివరామ్, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, వర్తన ఈశ్వరమ్మ, సరోజా, సింహాచలం, పుష్పలమ్మ, మాజి వైస్ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, నాయకులు భూషణ్, చిన్నయ్య, కోటిబాబు పాల్గొన్నారు.

సురక్ష హర్షనీయం



జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ సేవలు హర్షనీయం. సమస్యలు వెంటనే పరిష్కారం అవుతున్నాయి. గ్రామస్థాయిలోనే ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించడం చాలా గొప్ప విషయం. – సిరగం నిరోసా, గొచ్చరి గ్రామం, హుకుంపేట మండలం

కొండ రెడ్ల ఆర్థికాభివృద్ధికి కృషి

కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ కార్యదర్శి సునీల్ బండింగ్

మారేడుమిల్లి: రాష్ట్రంలో కొండ రెడ్డి కులాభివృద్ధికి కృషి చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ అండర్ కార్యదర్శి సునీల్ బండింగ్ తెలిపారు. మండలంలోని చావడికోట పంచాయతీ బంధ, బోడ్లంక గ్రామాల్లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, ట్రికార్ జనరల్ మేనేజర్ మణికుమార్‌తో కలిసి గురువారం ఆయన పర్యటించారు. అక్కడి కొండ రెడ్డి గిరిజనులతో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో కొండ రెడ్లకు ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయని, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ బండింగ్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జునుముండా ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దేశంలో 75 పీటీజీ కులాలు ఉండగా, ఏపీలో 9 పీటీజీ కులాలు ఉన్నాయని, అందులో కొండ రెడ్డి ఒకటని వివరించారు. ఇక్కడి ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని, అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల గిరిజనులు తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖధికారి రామతులసి పాల్గొన్నారు.

గంజాయి రవాణా... ఏజెన్సీ టూ మహారాష్ట్ర

- గత నెల 30న ఇద్దరికి, ఇపుడు మరో ఇద్దరికి రిమాండ్
- వ్యాన్, రూ.6.16 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ



బుచ్చియ్యపేట ఎస్సై కుమార్‌స్వామికి ప్రశంసా పత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: ఏజెన్సీలో గంజాయి పండించి లారీల్లో, వ్యాన్‌లలో మహారాష్ట్రకు అక్రమంగా రవాణా చేసే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను గత నెల 30న అరెస్ట్ చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్ పంపారు. వారి నుంచి రూ.6.16 లక్షల విలువైన 309 కేజీల గంజాయిని, ఒక వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణ మీడియాకి వెల్లడించారు.

గంజాయి అక్రమ రవాణాపై ముందస్తు సమాచారంతో గత నెల 30న బుచ్చియ్యపేట ఎస్సై కుమార్‌స్వామి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వడ్డాది నుంచి విజయరామరాజుపేట వేపు వెళ్తున్న ఏపీ 39 టీడీ 5859 నంబర్ గల వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా వ్యాన్ బాడీని ఆనుకుని అనుమానం రాకుండా ఐరెన్‌రేకుతో ఏడు అరలుగా ఏర్పాటు చేసి అందులో సుమారు నాలుగు కేజీల చొప్పున ఒక్కో ప్యాకెట్‌ను తయారీచేసి 77 ప్యాకెట్లను పేర్చారు. దీన్ని గుర్తించిన పోలీసులు వ్యాన్ డ్రైవర్ వంత భగవాన్, చక్రిలను అరెస్ట్ చేసి విచారించారు.

ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా లమతాపుట్టు బ్లాక్‌లోని నిరికి రఘునాథ్ తన చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయిని పండించి, పెదబయలు మండలం సోకిల లక్ష్మణరావు ద్వారా మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. భగవాన్, చక్రిలను గత నెల 30నే రిమాండ్‌కి పంపారు. ఈ కేసులో సోకిల లక్ష్మణరావు, నిరికి రఘునాథ్‌ల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి వీరిద్దరినీ అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కొత్తకోట ఇన్‌చార్జి సీఐ ఎ.రవికుమార్, బుచ్చియ్యపేట ఎస్సై కుమార్‌స్వామి, పోలీస్ సిబ్బంది జె.అర్జున్, కె.ఎస్.ఎస్.గణేష్, ఒ.కిరణ్, ఎం.వెంకట్రావ్‌లను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

క్లుప్తంగా

15 కిలోల గంజాయితో ఒకరు అరెస్టు



జి.మాడుగులలో గంజాయి నిందితుడితో సీఐ సత్యనారాయణ, పోలీసులు

జి.మాడుగుల : ఏజెన్సీ ప్రాంతం నుంచి గురువారం బైక్‌పై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. బుచ్చయ్యపేట మండలం గొర్లిపాలెం గ్రామానికి చెందిన కట్టా కూసలరావు ఏజెన్సీ ప్రాంతంలో 15 కిలోల గంజాయిని కొనుగోలు చేసి బైక్‌పై మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద తనిఖీల్లో పట్టుబడినట్టు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకొన్నామని, కేసు నమోదు చేసి ఏఎస్‌ఐ చిట్టిబాబు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బారావు, హెచ్‌సీ ఆనందరావు, పోలీసు సిబ్బంది చినబాబు, సత్యారావు పాల్గొన్నారు.

సెల్‌టవర్ సామగ్రి పడేశారు!



మార్గం మధ్యలో పడేసిన సెల్‌టవర్ సామగ్రి

జి.మాడుగుల: మండలంలోని కోరాపల్లి పంచాయతీ పెదజాగేరి నుంచి పినజాగేరి మార్గంలో సెల్‌టవర్ మెటీరియల్‌ను పడేశారు. పినజాగేరి గ్రామ సమీపాన సెల్ టవర్ ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. గ్రామానికి సరైన రోడ్డు లేకపోవటంతో సెల్ టవర్ నిర్మాణం కోసం తెచ్చిన సామగ్రిని మధ్యలోనే వదిలి పెట్టారని గ్రామస్తులు తెలిపారు. పినజాగేరి–పినజాగేరి మధ్య రోడ్డును నిర్మించటానికి ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట : నాగరాజుపేట రైల్వే గేటు వద్ద రైలు ఢీకొవడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. తుని నుంచి నర్సీపట్నం రోడ్డు వైపు వెళ్తున్న రైలు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఢీ కొట్టిందన్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చడమైందని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బోధనలో సరికొత్త అడుగులు..

డిజిటల్ చదువులు

అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో విద్యా బోధనలో సరికొత్త అడుగులు పడుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా విద్య అందించేలా నూతన విధానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుద్దముక్కలతో వినియోగించే బ్లాక్, గ్రీన్ బోర్డుల ద్వారా చేసే బోధనకు స్వస్తి చెప్పి డిజిటల్ విధానంలో విద్య అందించేందుకు సన్నద్ధం అవుతోంది. ఇందుకుగాను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) విధానాన్ని తీసుకువచ్చింది. త్వరలో ప్రారంభమయ్యే ఈ విధానంపై ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ మొదలుపెట్టారు.

- ఐఎఫ్‌పీ విధానానికి ప్రభుత్వం శ్రీకారం
- సుద్దముక్కలకు ఇక స్వస్తి
- నాడు–నేడులో అభివృద్ధి చేసిన 14 పాఠశాలల్లో అమలు
- ఆరు–పది తరగతి గదుల్లో ఇప్పటికే 167 ప్యానెల్స్ ఏర్పాటు
- ఐఎఫ్‌పీ బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఐఎఫ్‌పీపై ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

మాకవరపాలెం: సర్కారు బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ టీవీలతో డిజిటల్ క్లాస్ రూం (డీసీఆర్) ద్వారా బోధన అందించింది. దీనికి భిన్నంగా త్వరలో సరికొత్త విధానంలో విద్యా బోధన సాగించేందుకు నిర్ణయించింది. ఎక్కడాలేని విధంగా ఆధునిక సాంకేతికతతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) విధానాన్ని తీసుకువచ్చింది. జిల్లాలో మొదటి విడతగా నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన 14 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

బ్లాక్, గ్రీన్ బోర్డులకు స్వస్తి

పాఠశాలల్లో ఇప్పటివరకు బ్లాక్, గ్రీన్ బోర్డులపై సుద్దముక్కలతోనే విద్యా బోధన సాగుతోంది. విద్యార్థులకు ఏ పాఠం బోధించాలన్నా ఉపాధ్యాయులు కచ్చితంగా బోర్డులపై సుద్దముక్కలతో రాయాల్సిందే. అయితే ఇకపై డిజిటల్ బోధనలో భాగంగా నూతన విధానం ఐఎఫ్‌పీ అమల్లోకి వస్తే పాత పద్ధతులకు స్వస్తి పలికినట్టే. ఆరు నుంచి పది వరకు తరగతులు నిర్వహించే ప్రతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో 14 పాఠశాలల్లో 167 ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేశారు.

ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ బోధనపై ప్రత్యేక శిక్షణ

త్వరలో ప్రారంభం కానున్న ఐఎఫ్‌పీ బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పది తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 15 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. అనకాపల్లిలోని దాడి ఇంజినీరింగ్ కళాశాల, మాకవరపాలెం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 1 నుంచి ఈ శిక్షణ అందిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజుల వంతున జిల్లాలోని 334 పాఠశాలల్లో పనిచేస్తున్న 5,688 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

ఐఎఫ్‌పీ అంటే..

- విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అధునాతన డిజిటల్ విధానంలో బోధన అందించేందుకు తీసుకువచ్చిందే ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ప్రోగ్రాం
- ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు ఎంత క్లిష్టమైన పాఠాలైనా ఇట్టే అర్థమయ్యేలా బోధించవచ్చు.
- ఉపాధ్యాయుడు ఏదైనా కొత్త విషయాన్ని విద్యార్థులకు చెప్పాలంటే గతంలో తమ ఫోన్లో ఆ విషయాన్ని డౌన్‌లోడ్ చేసుకుని బోధించాల్సివచ్చేది. కానీ నూతన విధానంలో ఒక్క క్లిక్‌తో ఈ ప్యానెల్‌పై ప్రపంచంలో ఏముందో చూపించవచ్చు.
- గణితం, సైన్స్ బోధించే సమయంలో కొన్ని చిత్రాలు బోర్డులపై గీస్తూ బోధన చేయాల్సివచ్చేది. కానీ ఈ ప్యానెల్‌పై త్రిభుజాలు, చతుర్భుజాలు, మానవ అవయవాలు, తదితర ఏ చిత్రాలైనా ఇట్టే చూపించవచ్చు.
- మ్యాప్‌ల ద్వారా చూపించే కొన్ని అంశాలను ఇకపై నేరుగా విద్యార్థులకు వీడియోలు, ఫొటోల ద్వారా చూపించే వీలుంది.

బోధన సులభతరం



నూతన విధానంలో బోధన సులభం అవుతుంది. తక్కువ సమయంలో విద్యార్థులకు ఎక్కువ విషయాలను చెప్పే అవకాశం ఉంది. పాఠాలు విద్యార్థులకు కూడా ఇట్టే అర్థం అవుతాయి. ఐఎఫ్‌పీ విధానం మంచి ఫలితాలను ఇస్తుంది.

– కోసూరు రాము, ఉపాధ్యాయుడు తూటిపాల, మాకవరపాలెం మండలం

డిజిటల్ విద్య అవసరం



మారుతున్న విద్యా విధానంలో విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో అవసరం. ఐఎఫ్‌పీ ద్వారా బోధనతో సరికొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. దేశంలోనే అత్యుత్తమ విద్య అందించేందుకు తీసుకువస్తున్న డిజిటల్ విద్యా విధానం అభినందనీయం.

– కె.వెంకటరావు, ఐఎఫ్‌పీ ట్రైనర్

శిక్షణ పూర్తికాగానే ప్రారంభం



జిల్లాలో రెండు చోట్ల ఐఎఫ్‌పీపై శిక్షణ అందిస్తున్నాం. అది పూర్తి కాగానే నూతన విధానంలో బోధన ప్రారంభిస్తాం. ఇప్పటికే 14 పాఠశాలల్లో 167 ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేయడం పూర్తయింది. దశలవారీగా అన్ని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తాం.

– వెంకటలక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

కొండచిలువ హల్‌చల్



జెన్‌కో గెస్టుహౌస్‌లో బైక్ కింద కొండచిలువ

మోతుగూడెం: ఏపీ జెన్‌కో గెస్ట్ హౌస్‌లో కొండచిలువ హల్‌చల్ చేసింది. రాత్రి సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా పది అడుగుల కొండచిలువ కనబడడంతో ఒక్కసారిగా హడలిపోయారు. సమీపంలో ఓ స్కూటీ కింద మాటువేసి ఉంది. దీంతో పలువురు జెన్‌కో సిబ్బంది స్థానిక అటవీ శాఖకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది వచ్చి కొండచిలువను పట్టుకొని, సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

అరకు ఎంపీ దంపతుల ఔదార్యం



మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న శివప్రసాద్

కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గిరిజనుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటుచేయడంతో పాటు బాధిత కుటుంబాలకు అండగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ నిలిచి తమ ఔదార్యాన్ని చాటారు. వార్త వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యూరు మండలం ఎం.మాకవరం గ్రామానికి చెందిన సంబే సాయికుమార్ విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎంపీ మాధవి సూచన మేరకు భర్త కె.శివప్రసాద్ (నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు) బాధితులను కలిసి, అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా సాయికుమార్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందు అంబులెన్స్‌ను సమకూర్చారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

ఎడతెరిపి లేకుండా వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- రాకపోకలకు గిరిజనుల అవస్థలు



జంగంసరియా గ్రామం వద్ద బురదలో వాహనదారుడి అవస్థలు

ముంచంగిపుట్టు: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. వారం రోజులుగా మండలంతో పాటు సరిహద్దు రాష్ట్రం ఒడిశాలోను భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షాలకు మండలంలోని లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో ముంతగుమ్మి, బిర్రిగూడ, దొరగూడ, కర్లాపోదర్ గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీలకు చెందిన 19 గ్రామాల గిరిజనులు రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగింది. కొన్ని గ్రామాల గిరిజనులు నిత్యావసర సరకులు, అత్యవసర పనులతో ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న బిర్రిగూడ గెడ్డను దాటుకుని లక్ష్మీపురం వస్తున్నారు. బుంగాపుట్టు గ్రామ గిరిజనుల కారు వాగులో చిక్కుకోవడంతో అతి కష్టం మీద బయటకు తీశారు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామస్తులు జల దిగ్బంధంలో చిక్కుకుని ఉన్నారు. మినుములపుట్టు నుంచి జంగంసరియా గ్రామం మీదగా సెల్లుం వెళ్లే మార్గంలో సైతం వర్షానికి రహదారి అంతా బురదమయంగా మారి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిరీక్షణ... ఫలించిన వేళ

- కలెక్టర్ చొరవతో జాజులబంధలో పాఠశాల ప్రారంభం
- గ్రామస్తుల ఆనందం



జాజులబంధలో పాఠశాలను ప్రారంభిస్తున్న చింతపల్లి, కొయ్యూరు ఎంఈవోలు

కొయ్యూరు: మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబంధలో పండగ వాతావరణం నెలకొంది. పాఠశాల ఏర్పాటు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కల నెరవేరింది. ఈ మేరకు చింతపల్లి ఎంఈవో ప్రసాద్, కొయ్యూరు ఎంఈవో బోడంనాయుడు గురువారం జాజులబంధ వెళ్లి పాఠశాలను స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఇక్కడ బడిఈడు కలిగిన 29 మంది పిల్లలున్నారు. ఇది మారుమూల ప్రాంతంతోపాటు రహదారి సౌకర్యం లేకపోవడంతో పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు భయపడేవారు. ఇక్కడ పాఠశాల లేక చాలా దూరం వెళ్లాల్సి ఉండటంతో చదువుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో సీపీఎం నేత గోవిందరావు ఆధ్వర్యంలో ఇది వరకు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

పాఠశాల ఏర్పాటుతోపాటు ఉపాధ్యాయుడిని నియమించారు. త్వరలో మరో ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేస్తామని ఎంఈవో తెలిపారు. ఎట్టకేలకు పాఠశాల ఏర్పాటు చేయడం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ఎంఈవోలు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాంతోపాటు పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేశారు. పాఠశాల ప్రారంభం రోజే వీటిని అందించడంతో విద్యార్థులు మురిసిపోయారు.

పీవోను కలిసిన కేంద్ర కమిటీ సభ్యులు

రంపచోడవరం: మన్యంలోని కొండ రెడ్డి కులస్తుల జీవన విధానాన్ని తెలుసుకునేందుకు వచ్చిన కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశీలకుడు సుశీల్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ జనరల్ మేనేజర్ మణి కుమార్ క్షేత్రస్థాయి పర్యటన తర్వాత గురువారం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిశారు. ఏజెన్సీలో కొండ రెడ్లకు అమలు చేస్తున్న పథకాలు, సమస్యలపై చర్చించారు.

గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి..

గిరిజన విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సెక్రటరీ సునీల్ తెలిపారు. రంపచోడవరం మండలం ముసురుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠాలు అర్థం కాకపోతే తిరిగి చెప్పాలని ఉపాధ్యాయులను అడగాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యను ఆరా తీశారు. ఐటీడీఏ ఏపీఓ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవో రామ తులసి, హెచ్‌ఎం కె.ఆర్.పి. కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రూ.10 వేల సాయం చేసిన భాగ్యలక్ష్మి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సాంబెల్లి సాయి కుటుంబాన్ని పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. మండలంలోని ఎం. మాకవరానికి చెందిన సాయి మరణించారన్న సమాచారం తెలుసుకున్న వెంటనే ఆమె ఇక్కడకు చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. రూ. 10 వేల సాయం అందజేశారు. చిన్న వయసులోనే మరణించడం బాధాకరమన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు, నేత సత్యనారాయణ, సర్పంచ్‌లు కోడా చింతల్లి, సెగ్గే రమాదేవి, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసలినాయుడు, దూం శ్రీను, మహేశ్, పొడుగు సూరిబాబు, అచ్చిరాజు, వనంబాబు పాల్గొన్నారు.

బాలికను కొట్టిన ఉపాధ్యాయుడిపై విచారణ



చోటముక్కిపుట్టు పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు : ఏనుగురాయి పంచాయతీ చోటముక్కిపుట్టు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కె.సమత అనే విద్యార్థినిని ఉపాధ్యాయులు మందలించి, కొట్టారని ఆ విద్యార్థిని తండ్రి వాట్సాప్‌లో పోస్టు పెట్టడం హల్‌చల్ చేసింది. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి గురువారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థిని తండ్రి, పాఠశాల విద్యా కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. విద్యార్థినిని ఉపాధ్యాయుడు కొట్టడం నిజమే కానీ ఉపాధ్యాయులపై చర్యలు వద్దని, మందలిస్తే చాలని, ఇక మీదట విద్యార్థులను కొట్టకుండా చూడాలని విద్యార్థిని తండ్రి విద్యాశాఖ అధికారికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను కొట్టి గాయపరచడం సరికాదని, కేవలం మందలించే హక్కు మాత్రమే ఉపాధ్యాయులకు ఉందని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరావు, పాఠశాల చైర్మన్ ప్రసాదరావు, సీఆర్‌పీ గౌరిశంకర్ పాల్గొన్నారు.

గోతిలో చిక్కుకున్న ఆవును కాపాడిన రైతులు



రాజవొమ్మంగి పీహెచ్‌సీ వద్ద గోతిలో పడ్డ ఆవు

రాజవొమ్మంగి : మేత కోసం అటుగా వెళ్లిన ఆవు దాదాపు 10 అడుగుల లోతు వున్న లెట్రిన్ గోతిలో పడిపోయింది. స్థానిక పీహెచ్‌సీ ఉద్యోగుల క్వార్టర్స్ వద్ద జరిగిన ఈ సంఘటన 24 గంటల తరువాత గురువారం వెలుగులోకి వచ్చింది. దీంతో రవీంద్రనగర్, విద్యానగర్‌కు చెందిన రైతులు ఆ ప్రాంతానికి వచ్చి తాళ్ళు, నిచ్చెనల సహాయంతో అతి కష్టంపై ఆవును బయటకు తీసి కాపాడారు. ఆవు ప్రాణాలు దక్కడంతో రైతులు ఊపిరి పీల్చుకొన్నారు. కాగా ఈ ఆవు యజమాని ఎవరో తెలియరాలేదు. కాగా ఓ ప్రాణాన్ని కాపాడామన్న సంతోషం సర్వత్రా వ్యక్తం వ్యక్తం అయ్యింది. తొలకరి వచ్చినా కట్టడి చేయకుండా, మేత వేయకుండా పశువులను విచ్చలవిడిగా వదిలిపెట్టడం విచారకరమని పలువురు అంటున్నారు.

'ఉపాధి' సామాజిక తనిఖీలకు రంగం సిద్ధం

నేటి నుంచి గ్రామసభలు

రాజవొమ్మంగి: మండలంలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన రూ.17.80 కోట్ల విలువైన ఉపాధి పనుల సామాజిక తనిఖీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా నుంచి ఎస్‌ఆర్పీ, ఏడుగురు డీఆర్పీలు గురువారం రాజవొమ్మంగి వచ్చారు. వీరితో స్థానిక ఉపాధి హామీ పీఓ/ ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తన కార్యాలయంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి పనుల తనిఖీలను నిబద్ధతతో చేపట్టాలన్నారు. మండల వ్యాప్తంగా 1,240 ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి డీఆర్పీలు ఏడు బృందాలుగా ప్రతి పంచాయతీకి వెళ్లి ఉపాధి పనులపై గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలు ఏవైనా ఉంటే స్వీకరిస్తారన్నారు. పని ప్రాంతానికి వెళ్లి పనులు ఏ విధంగా జరిగాయో కొలతలు తీసి, క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. ఏ గ్రామంలోనైనా ఉపాధి పనులపై అవకతవకలు జరిగినట్లయితే గ్రామ సభల్లో ప్రజలు తమ అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించవచ్చని, విచారణ చేపట్టి తేడాలు ఏవైనా ఉంటే తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ గ్రామసభలు 15వ తేదీతో ముగిస్తాయని, 17న ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక ఉంటుందన్నారు. ఈ సమన్వయ సమావేశంలో ఉపాధి ఏపీఓ సురేష్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఏఈ వీరభద్రరావు, ఉపాధి టీఏలు, ఎఫ్‌ఏ, సిబ్బంది పాల్గొన్నారు.